ప్రజాశక్తి
మంగళవారం 17 సెప్టెంబర్ 2024 5 శ్రీ సత్యసాయి





బ్రహ్మసముద్రంలో మౌనదీక్షలో పాల్గొన్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు, తదితరులు

అదునులో లేని పదును



మొక్కజొన్న, వేరుశనగ పంటలు ఎండుముఖం
వర్షాభావంతో ఎండుతున్న 12 వేల ఎకరాలు...
అయోమయంలో రైతులు
పెట్టుబడి కూడా తిరిగిరాని పరిస్థితి

ఈ ఏడాది ఆశించిన దానికంటే అధికంగా వర్షాలు కురిసాయి. వర్షాలు బాగా పడ్డాయి, పంటలకు ఈసారి ఢోకా లేదనుకుంటే పొరపాటే. పంట కీలకమైన దశలో వర్షం కురవక పోవటంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో పంటలు ఎండు ముఖం పట్టాయి. దీంతో లక్షలాది రూపాయలు అప్పు చేసి పంట సాగు చేసిన రైతు పరిస్థితి అయోమయంగా మారింది. సీజన్ మొత్తానికి వర్షపాతం నమోదయినా నెలల వారిగా తీసుకుంటే ఆయా నెలల్లో వర్షపాతం తక్కువగా నమోదయింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చూస్తే సీజన్ మొత్తానికి తలుపుల మండలంలో సాధారణం కంటే 32.7 మిల్లీమీటర్ల తక్కువ వర్షపాతం నమోదయింది. భారీ వర్షాలకు, వరదలకు రాష్ట్రంలో పలు జిల్లాల్లో పంటలు నీటమునిగి, ఊళ్లకు ఊళ్లు జలమయమయ్యాయి. వరద ధాటికి రాష్ట్రకేంద్రంలో ఇప్పటికీ పరిస్థితి దయనీయంగా ఉంది. అయితే ఉమ్మడి అనంతపురంలో జిల్లాలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. పంట దిగుబడికి కీలమైన సెప్టెంబర్ మాసంలో వర్షం జాడ లేకపోవటంతో ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు ఎండుముఖం పడ్డాయి.

ప్రజాశక్తి - చిలమత్తూరు

చిలమత్తూరు మండలంలో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో ఆశాజనకంగా వర్షాలు రావడంతో రైతులు ఎక్కువ శాతం మొక్క జొన్న, వేరుశనగ సాగు చేశారు. దీంతో రైతు భరోసా కేంద్రాల వద్ద ఎరువుల కోసం రైతులు పెద్ద ఎత్తున బారులు తీరడం చూశాం. ఎరువులు మందులు అంటూ వేలాది రూపాయలు ఖర్చు చేశారు. ఈ ప్రాంతంలో మొక్కజొన్న మొలక దశలోనే కత్తెర పురుగు ప్రభావం అధికం కావడంతో రైతుకు సాధారణం కంటే అధికంగా ఖర్చులు వచ్చాయి. మూడు నెలలుగా ఆశాజనకంగా ఉన్న పంటలు వర్షాభావం కారణంగా ఒక్క సారిగా ఎండుముఖం పడ్డాయి. ప్రస్తుతం మొక్క జొన్న కంకె దశలో, వేరుశనగ కాయ దశలో ఉంది. కీలకమైన ఈ సమయంలో వర్షం కురవక పోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. మండల వ్యాప్తంగా సుమారు 6640 ఎకరాలలో మొక్క జొన్న పంటను రైతులు సాగు చేశారు. ఇక వేరుశనగ పంట 2640 ఎకరాలు, కంది 660 ఎకరాలు, మిగిలిన చిరు పంటలతో కలుపుకుని మండల వ్యాప్తంగా దాదాపు 12100 ఎకరాల వరకు రైతులు పంటసాగు చేశారు. కీలమైన సెప్టెంబర్ మాసంలో వర్షం కురవక పోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోనున్నారు.



ఎండిపోయిన మొక్కజొన్న కంకి

వర్షం పరిస్థితి ఇలా...!

పంటలు బాగా చేతికి రావాలంటే వ్యవసాయశాఖ అంచనాల మేరకు జూన్, జులై, ఆగష్టు,సెప్టెంబర్ నెలల్లో 252 మిల్లీమీటర్ల వర్షం అవసరం. అయితే ఈ నాలుగు నెలల్లో కురిసిన వర్షపాతం 461 మిల్లి మీటర్లు. అంటే అధికారుల లెక్కల ప్రకారం కురవాల్సిన వర్షం కన్నా 209 మిల్లీ మీటర్లు అధికంగా కురిసింది.ఈ లెక్కన పంటలు బాగా పండాలి. అయితే మండలంలో పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. ప్రభుత్వం నాలుగు నెలల వర్షపాతాన్ని సగటున తీసుకుంటోంది. అయితే నెలల వారిగా తీసుకుంటే పరిస్థితి మరోలా ఉంది. జూన్ లో కురవాల్సిన వర్షం 56 మిల్లీమీటర్లు కాగా కురిసింది 157 మిల్లీమీటర్లు. జులై లో కురవాల్సింది 63 మిల్లీమీటర్లు కాగా కురిసింది 58.5 మిల్లీమీటర్లు ఆగస్టు మాసంలో కురవాల్సిన వర్షం 76 మిల్లీమీటర్లు అయితే కురిసింది 224 మిలీమీటర్లు. ఈ మూడు నెలలు మొక్క పెరిగే దశ కాబట్టి పంటలు ఏపుగా పెరిగాయి. ఇక సెప్టెంబర్ నెలకు వస్తే ఇప్పటి వరకు కేవలం 1.3 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదయింది. అయితే అధికారుల లెక్కల ప్రకారం ఈ మాసంలో 57 మిల్లీ మీటర్ల వర్షపాతం అవసరం. ఈ నెల మొక్క జొన్నకు కంకి దశ, వేరుశనగకి బుడ్డ నుండి కాయ ఊరే దశ. ఈనెలలు అత్యల్పంగా వర్షం కురవడంతో పూర్తి స్థాయిలో పంటలు దెబ్బ తిన్నాయి. రానున్న 15 రోజులలో వర్షం కురిసినా కంది, అనుమ, రాగి వంటి పంటలు మినహా మిగిలిన పంటలు ఆశించిన స్థాయిలో చేతికి అందని పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు పరిస్థితి దయనీయంగా మారనుంది. ప్రభుత్వం 4 నెలలను సగటుగా తీసుకోకుండా నెలల వారిగా తీసుకొంటే రైతులకు ప్రభుత్వం నుండి పంట నష్టపరిహారం అందే అవకాశం ఉంటుంది.

పెట్టుబడి కూడా చేతికి అందదు



నేను 2 ఎకరాలలో మొక్క జొన్న సాగుచేశాను. ఖర్చు తక్కువగా వస్తుందనుకున్నాను. తక్కువన్నా నాకు రెండు ఎకరాలకు ఇప్పటి వరుకు సుమారు రూ.60 వేల వరకు ఖర్చు వచ్చింది. ప్రస్తుతం పశువుల మేతకు మాత్రమే పంట పనికి వస్తుంది. పంటను కోసి భద్రపరుచుకోవాలన్నా మరలా కూలీ రేటు ఖర్చు వస్తుంది, ఏమి మిగిలే పరిస్థితి లేదు. పెట్టుబడి కూడా చేతికి అందదు. ప్రభుత్వమే ఆదుకోవాలి.

వేణుగోపాల్ రెడ్డి,
రైతు, కమ్మయ్యగారిపల్లి

కీలక దశలో వర్షాభావం

సెప్టెంబర్ మాసంలో వర్షం కురవడం కీలకం. ఎందుకంటే పంటకు ఇది కీలకమైన దశ. మొక్క జొన్న కంకి,వేరుశనగ కాయ పెరిగే దశ. అయితే సెప్టెంబర్‌లో ఇప్పటివరకు 1.3 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదయింది. రాబోయే 15 రోజులలో కనీసం 55 మిల్లీమీటర్ల వర్షం నమోదయితే రైతులకు కొద్ది వరకు మేలు జరగవచ్చు.

వంశీకృష్ణ
మండల వ్యవసాయ శాఖ అధికారి



ఎండుముఖం పట్టిన వేరుశనగ పైరు

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు

ప్రజాశక్తి - బ్రహ్మసముద్రం

శ్రీరామిరెడ్డి, సత్యసాయి తాగునీటి పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించేదాకా నిరవధిక సమ్మెను కొనసాగిస్తామని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు తేల్చిచెప్పారు. తమ సమస్యల పరిష్కారం కోసం తాగునీటి పథకం కార్మికులు చేస్తున్న సమ్మెలో భాగంగా ఓబులు సోమవారం నిరవధిక సమ్మెలో పాల్గొని సంఘీభావం తెలిపారు. అంతకు మునుపు సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం నిరవధిక సమ్మెలో భాగంగా కార్మికులతో కలసి నల్లగుడ్డలు నోటికి కట్టుకుని మౌన ప్రదర్శన చేశారు. అనంతరం ఓబులు మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకూ నిరవధిక సమ్మె కొనసాగిస్తామని వెనకడుగు వేసే ప్రసక్తే లేదని అన్నారు. తాగునీటి పథక కార్మికుల పట్ల ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోందని విమర్శించారు. బకాయి వేతనాలను తక్షణ మంజూరు చేయాలని అలాగే క్యూప్, క్యూ సి లను యుద్ధ ప్రాతిపదికను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. ప్రస్తుతం ఒక పక్క గ్రామాల్లో తాగునీరు లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని మరో పక్క కుటుంబపోషణ కరువై కార్మికులు రోడ్లెక్కి దీక్షలు చేస్తున్నారని అన్నారు. వీటికి ప్రధాన కారణం అధికారుల నిర్లక్ష్యమేనని అన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం అనంతపురం బైపాస్ నుండి ఎస్ఈ కార్యాలయం వరకు, అక్కడి నుండి కలెక్టరేట్ కార్యాలయానికి బైక్ యాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున కార్మికులు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. తాగునీటి పథకం కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెకు బ్రహ్మసముద్రం మండల అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ సెక్టార్ లీడర్ పొబ్బర్లపల్లి సుజాత తదితరులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ జిల్లా అధ్యక్షురాలు శకుంతల, శ్రీరామ్ రెడ్డి తాగునీటి పథకం కార్మికుల జిల్లా ట్రెజరర్ వన్నూరుస్వామి, కార్మికులు తిప్పేస్వామి, గోవిందు, తిప్పేస్వామి, లింగమయ్య, ఎర్రిస్వామినాయక్, రవి తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం : తాగునీటి పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో పాలకులు, అధికారులు విఫలమయ్యారని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, శ్రీరామిరెడ్డి, సత్యసాయి తాగునీటి పథకం కార్మికుల యూనియన్ గౌరవాధ్యక్షులు జి. ఓబులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కళ్యాణదుర్గం తహశీల్దారు కార్యాలయం ఎదుట శ్రీరామిరెడ్డి, సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారానికి 12వ రోజుకు చేరుకుంది. మంగళవారం చేపట్టిన సమ్మెకు మద్దతు పలికిన ఓబులు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో వందలాది గ్రామాలకు తాగునీరు అందిస్తున్న శ్రీరామిరెడ్డి, సత్యసాయి తాగునీటి పథకాలకు ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడం దుర్మార్గమన్నారు. ఉమ్మడి జిల్లాకు ఏడాదికి రూ. 100కోట్లు కూడా ఇవ్వలేని పరిస్థితితో ప్రభుత్వం ఉందని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, అధికార యంత్రాంగం స్పందించి తక్షణమే నిధులు మంజూరు చేసి కార్మికుల సమ్మె విరమింపజేయాలని కోరారు. కార్మికుల సమస్యలు పరిష్కరించేదాకా సమ్మె కొనసాగిస్తామని అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మంగళవారం అనంతపురం కలెక్టర్ కార్యాలయం వరకు నిర్వహించే బైక్ర్యాలీలో అధికసంఖ్యలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో సిఐటియూ జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్, అంగనవాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శకుంతల, సిఐటియు నాయకులు వన్నూరుస్వామి, వన్నూరప్ప, నరేష్, భవిత్, తులసి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.



కళ్యాణదుర్గంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య

ప్రజాశక్తి గుంతకల్లు రూరల్

గుంతకల్లు మండల పరిధిలోని చింతలంపల్లి గ్రామానికి చెందిన యువరైతు అప్పుల బాధతో ఆదివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనకు సంబందించి బాధితులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు... చింతలంపల్లి గ్రామానికి చెందిన రాజశేఖర్(34) అనే రైతు తనకున్న నాలుగు ఎకరాల పొలంలో మిరప పంటను ప్రతి ఏడాది సాగు చేస్తున్నాడు. అయితే మూడు సంవత్సరాలుగా మిరప పంట దిగుబడి రాలేదు. దీంతో అప్పులపాలయ్యాడు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది తన నాలుగు ఎకరాల పొలంతో పాటు అదే గ్రామంలోని ఓ రైతుకు చెందిన 20 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వేరుశనగ పంట సాగు చేశాడు. పంట చేతికొచ్చిన సమయంలో ఎడతెరిపి లేని వర్షాలతో పంట మొత్తం పూర్తిగా నష్టపోయాడు. గత మూడు సంవత్సరాలుగా పంట నష్టపోవటంతో పాటు ఈ ఏడాది కూడా చేతికొచ్చిన పంట నోటికి అందకకుండా పోయింది. మూడేళ్లుగా పంటసాగుకు, కుటుంబపోషణకు దాదాపు రూ. 20 లక్షల దాకా అప్పు చేశాడు. కేవలం ఈ ఏడాది వేరుశనగ సాగు చేసి నష్టపోవటంతో రూ.9 లక్షల వరకు అప్పు అయింది. దీంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలన్న మనోవేదనకు రాజశేఖర్ గురయ్యాడు. అదే సమయంలో అప్పు ఇచ్చిన వారి నుంచి ఒత్తిడి మొదలైంది. గ్రామంలో తలవంపులు తెచ్చుకుని అవమాన భారం మోయలేక ఊర చివర ఉన్న తన పొలం వద్దకు ఆదివారం రాత్రి వెళ్లిన రాజశేఖర్ తన వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. రాజశేఖర్ ఎంతసేపటికి ఇంటికి రాకపోవటంతో రాకపోవడంతో అతడి మేనమామ పొలం వద్దకు వెళ్లి చూడగా రాజశేఖర్ అపస్మారక స్థితిలో కన్పించాడు. దీంతో కుటుంబసభ్యులకు సమాచారమిచ్చి హుటాహుటిన గుంతకల్లు లోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూరాజశేఖర్‌మృతిచెందాడు.మృతునికి భార్య జ్యోతితో పాటు 9వ తరగతి చదువుతున్న కూతురు, ఆరు సంవత్సరాల బాలుడు ఉన్నారు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.



మృతుడు రాజశేఖర్

సచివాలయ విద్యుత్ ఉద్యోగి మృతి

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల పరిధిలోని తుంగోడు సచివాలయంలో విద్యుత్ ఉద్యోగిగా పనిచేస్తున్న చంద్రశేఖర్ సోమవారం ఆకస్మికంగా మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు... తనకల్లు మండలం కొక్కంటి గ్రామానికి చెందిన చంద్రశేఖర్ సోమందేపల్లి మండలం తొంగోడు సచివాలయ పరిధిలో విద్యుత్ ఉద్యోగిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇతను పత్తి కుంట పల్లి గ్రామంలో ఒక అద్దె భవనంలో తోటి ఉద్యోగితో కలసి ఉండేవాడు. సోమవారం ఇద్దరూ తమ విధులకు హాజరవడానికి వెళ్లాడు. చంద్రశేఖర్ విధులు ముగించుకొని మధ్యాహ్నం తన గదిలోకి వెళ్లి పడుకున్నాడు. సాయంత్రం అయినా చంద్రశేఖర్ బయటకు రాకపోవటంతో అనుమానం వచ్చిన చుట్టుపక్కల వారు వెళ్లి చూశారు. అయితే అప్పటికే చంద్రశేఖర్ మృతిచెందాడు. విషయాన్ని గ్రామస్తులు పోలీసులకు తెలిపారు. ఈ మేరకు ఎస్ఐ రమేష్ బాబు, ఎఎస్ఐ మురళి ఆధ్వర్యంలో పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడి కావాల్సుంది.

17న ఎమ్మెల్యే కార్యాలయంలో జాబ్‌మేళా

పుట్టపర్తి రూరల్ : పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కార్యాలయంలో ఈనెల 17న జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్యే సింధూరరెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ప్రత్యేక చొరవతో అమరరాజా గ్రూప్ ఆఫ్ కంపెనీ లో చిత్తూరు ,తిరుపతి నందు అపరేటర్లగా నియమించడానికి నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులు ఈ నెల 17 న ఉదయం 10 గంటలకు పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోనీ సత్యసాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వెనుకవైపు ఉన్న పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె క్యాంపు కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి, అర్హత కలిగిన యువతీయువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హత 10 పాస్ ,ఫెయిల్, ఇంటర్ పాస్ , ఫెయిల్, ఐటిఐ పాస్, ఫెయిల్ అయిన వారు జాబ్‌మేళాకు హాజరుకావచ్చునని తెలిపారు. ఈ ఇంటర్వ్యూలకు హాజరై వారికి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో భోజన వసతి కల్పించినట్లు వెల్లడించారు. ఎంపికైన వారికి ట్రైనింగ్ అనంతరం రూ.22వేల వేతనం అందించబడుతుందని కంపెనీ ప్రతినిధులు పేర్కొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక కార్యక్రమం

నల్లచెరువు : స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17 నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకూ ప్రతి గ్రామ పంచాయతీలో పారిశుధ్య కార్యక్రమలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి శుభ్రం చేయడం, పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు, తదితర కార్యక్రమాలు చేపడతామన్నారు. అలాగే స్కూల్స్, హాస్టల్స్‌లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజలు కూడా స్వచ్ఛందంగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పెనుకొండను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి - పెనుకొండ టౌన్

పెనుకొండను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని భోగసముద్రం జల వన సంరక్షణ సమితి సభ్యులు ఎంపీ పార్థసారధిని కోరారు. ఈ మేరకు వారు సోమవారం పట్టణంలో ఎంపీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వారు పెనుకొండ పట్టణాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ఎంపీని కోరారు. గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో భోగసముద్రం చెరువు అభివృద్ధి, పెనుకొండ పట్టణం నుండి భోగసముద్రం చెరువు వరకు సిమెంట్ రోడ్డు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని గుర్తు చేశారు.. స్పందించిన పార్థసారధి పెనుకొండ పట్టణాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెవిపిఎస్ కమిటీ అధ్యక్షుడు పాపా నాయుడు, సభ్యులు గిరి, చంద్ర మౌళి, రమేష్, రాము, త్రినాథ్, వనరాజ్ తదితరులు పాల్గొన్నారు.



నాయకులతో మాట్లాడుతున్న ఎంపీ పార్థసారధి

క్వారీ పనులు నిలిపేయాల్సిందే..


వివిధ గ్రామాల ప్రజలు ఆందోళన.. మంత్రి సవితకు వినతి



క్వారీ వద్ద ఆందోళన చేపట్టిన వివిధ గ్రామాల ప్రజలు

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండలంలోని పాపిరెడ్డిపల్లి చెరువు సమీపంలో ఉన్న వేలుపుకొండలో నిర్వహిస్తున్న క్వారీని కార్యకలాపాలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండలంలోని నాగినేనిచెరువు, తండా, వెలగమాకలపల్లి, తండా, పాపిరెడ్డిపల్లి గ్రామాల ప్రజలు క్వారీ వద్ద ఆందోళన చేపట్టారు. అలాగే మంత్రి సవితకు వినతి పత్రం ఇచ్చారు. ఆయా గ్రామాల ప్రజలు మాట్లాడుతూ తాము తరతరాలుగా వేలుపుకొండ ప్రాంతాల్లో ఆవులు, గొర్రెలు, మేకలు మేపుతూ, ఉన్న కొద్దిపాటి భూమిలో పంటలు పండిస్తూ జీవనం కొనసాగిస్తున్నామన్నారు. అయితే కొండలో క్వారీ యజమానులు పెద్దఎత్తున పేలుళ్లు జరపడంతో సమీప గ్రామాల్లో ఇళ్ల గోడలు బీటలు వారుతున్నాయని, సుమారు 300 ఎకరాల్లో పంట పొలాలు దెబ్బతిన్నాయని వాపోయారు. పశువులు, గొర్రెలు, మేకలను మేపుకొంటూ జీవనం సాగిస్తున్న తాము ఈ క్వారీ వల్ల జీవనోపాధి కోల్పోతున్నామన్నారు. ఇప్పటికే కొన్ని ఇళ్లు కూలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. క్వారీ నుంచి వెలువడే దుమ్ము, ధూళి కారణంగా వందల ఎకరాలు బీడు భూములుగా మారాయన్నారు. ఈ కొండలో మా అడవి దేవత అక్కమ్మ కొలువై ఉన్నారని, ఏటా అమ్మవారికి పూజలు నిర్వహిస్తామని, అలాంటి కొండను క్వారీ యజమానులు ఇష్టారాజ్యంగా పేలుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ సమయంలో మంత్రి సవిత పెనుకొండ వైపు నుంచి బెంగళూరు వెళ్తుతుండగా మార్గమధ్యలో గ్రామస్తులు ఆపి క్వారీ వల్ల జరిగే నష్టాలను వివరించి, క్వారీలో కార్యకలాపాలను నిలిపేయాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. స్పందించిన మంత్రి మీ సమస్య త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు వెనుదిరిగి వెళ్లారు. కార్యక్రమంలో డివి.ఆంజనేయులు, శంకర్‌నాయక్, భీమ్లానాయక్, కడపల్లి రంగప్ప, నరసింహమూర్తి, మండ్లి హనుమంతు, కడపల్లి రమణ, రాయప్ప, తలారి చలపతి, జనార్ధన్, కడపల్లి నరసింహులు, సోమలానాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.



మంత్రి సవితకు వినతిపత్రం ఇస్తున్న ప్రజలు



హాస్టల్ విద్యార్థినులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

బాలికల వసతిగృహం పరిశీలన

కొత్తచెరువు : స్థానిక పుట్టపర్తి రోడ్డులో అద్దె భవనంలో నిర్వహిస్తున్న బాలికల వసతి గృహాన్ని సోమవారం రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత సందర్శిం చారు. ఆమె విదార్థినుల గదులు, బాత్‌రూమ్‌లు, వంట గదులను పరిశీలించారు. సౌకర్యాలపై అసంతృప్తి వ్యకం చేశారు. సెలవు రోజు కావడంతో వార్డెన్, సిబ్బంది లేకపోవడంతో హాస్టల్‌లో ఉన్న కొద్దిమంది విద్యార్థినులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని ఆరా తీశారు. సదుపాయాలు సక్రమం గా లేనందున విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు మంత్రికి వివరించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వెనుక హాస్టల్ భవన నిర్మాణం కోసం 8 ఏళ్ల క్రితం కోటి రూపాయలు మంజూరు కాగా బిల్డింగ్ నిర్మించారు. అందులో ఇంకా 30 శాతం పనులు జరగాల్సి ఉండగా నిధులు లేమితో పనులు ఆగిపోయాయని, తక్షణమే నిధులు మంజూరు చేసి భవన నిర్మాణం పనులు పూర్తి చేయాలని మంత్రిని కోరారు.



అమర రాజా కంపెనీ ప్రతినిధులను సన్మానిస్తున్న గుండుమల తిప్పేస్వామి

జాబ్‌మేళాలో 160 మంది ఎంపిక

మడకశిర : నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించడానికే జాబ్‌మేళా ఏర్పాటు చేశామని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి తెలిపారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఆదేశాల మేరకు సోమవారం పట్టణంలోని యాదవ కళ్యాణ మండపంలో అమర రాజా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. కంపెనీ ప్రతినిధులు 160 మందిని ఎంపిక చేసుకుని వారికి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ లక్ష్మినారాయణ, మద్దనకుంటప్ప, కల్లుమర్రి సర్పంచి నాగరాజు, ఆసుపత్రి కమిటీ డైరెక్టర్లు మారుతిరెడ్డి, కృష్ణమూర్తి, దాసిరెడ్డి, అమర్ రాజా కంపెనీ ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మంత్రికి ఎమ్మెల్యే సన్మానం



మంత్రికి పూలబొకే ఇస్తున్న ఎమ్మెల్యే

మడకశిర : రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ జన్మదిన సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే ఎంఎస్.రాజు మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ధర్మవరం పట్టణంలోని మంత్రి కార్యాలయంలో మంత్రి సత్యకుమార్‌ను కలిసి పూలబొకే అందజేసి శాలువా కప్పి సన్మానించారు.

వైసిపి, టిడిపి గ్రూపుల మధ్య వాగ్వాదం

కొత్తచెరువు : స్థానిక ధర్మవరం రోడ్డులోని 384 సర్వే నెంబర్‌లో వైసిపి ప్రభుత్వం ఆ పార్టీకి చెందిన 23 మంది నాయకులు, కార్యకర్తలకు రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేశారు. దీంతో వారు ఇళ్లు నిర్మించుకోవ డానికి ఆదివారం పునాది కోసం తవ్వకాలు చేస్తుండగా టిడిపి నాయకులు అక్కడికి చేరుకుని అడ్డుకు న్నారు. దీంతో ఇరు వర్గాలు వాదోపవాదాలు చేసుకొని ఘర్షణలకు పాల్పడ్డారు. టిడిపి నాయకులు మాట్లాడుతూ వారికి రిజిస్ట్రేషన్ పత్రాలు మాత్రమే ఇచ్చారని, ఇళ్ల పట్టాలు ఇవ్వలేదని, నిర్మాణ పనులు ఎలా చేపడతారని ప్రశ్నించారు. ఈ విషయం పోలీసులకు తెలియడంతో ఇరు వర్గాలను స్టేషన్‌కు పిలిపించి తహశీల్దార్ వచ్చిన వెంటనే విచారణ నిర్వహించి న్యాయం చేస్తామని తెలిపారు.

ఉద్యోగి ఆత్మహత్యాయత్నానికి కారకులను సస్పెండ్ చేయాలి

సోమందేపల్లి : స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో 104 సిబ్బందిగా పనిచేస్తున్న శ్రీరామిరెడ్డి ఆత్మహత్యాయత్నానికి కారకుడైన అధికారి రామకృష్ణను వెంటనే సస్పెండ్ చేయాలని సిఐటియు జిల్లా కోశాధికారి సాంబశివ సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖలో చిన్న ఉద్యోగులు, ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలపై ఉన్నతాధికారుల వేధింపులు అధికమయ్యాయని, వీటిని జిల్లా వైద్యాధికారులు నియంత్రించాలని కోరారు. బాగా పని చేసే వ్యక్తులను తొలగించి వారికి అనుకూలమైన వ్యక్తులను నియమించుకోవడం కోసమే వేధింపులకు గురి చేస్తున్నారని, ఈ విధానాలను సిఐటియు ఖండిస్తుందన్నారు.

జెఎన్‌టియు మాజీ ప్రొఫెసర్ సౌందర్ రాజన్ మృతి

అనంతపురం : స్థానిక జెఎన్‌టియు కళాశాల ఇసిఇ విభాగం మాజీ ప్రొఫెసర్ సౌందర్‌రాజన్ సోమవారం మధ్యాహ్నం మృతిచెందారు. విషయం తెలుసుకున్న జెఎన్‌టియు ఇన్‌ఛార్జి విసి హెచ్.సుదర్శనరావు, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, వర్సిటీ డైరెక్టర్లు భానుమూర్తి, వైశాలి ఘోర్పాడే, సుజాత, సత్యనారాయణ, జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షులు టి.నారాయణరెడ్డి, కార్యదర్శి శారద, అసోషియేట్ ప్రెసిడెంట్ ఎపి.శివకుమార్, సభ్యులు సి.శశిధర్, మమత, అజిత, తదితరులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఘనంగా వినాయక నిమజ్జనం



వినాయక లడ్డూ వేలం వేస్తున్న నిర్వాహకులు

రొద్దం : రొద్దంలో సోమవారం వినాయకుని నిమజ్జనం వేడుకలు ఘనంగా నిర్వహించారు. దాదాపు రూ. 6 లక్షలు ఏర్పాటు చేసి గ్రామంలో ఏర్పాటు చేసిన 21 అడుగుల వినాయకుని విగ్రహానికి 11 రోజుల పాటు పూజలు చేశారు. నిమజ్జనం సందర్భంగా ముందుగా ఎంపి బికె.పార్థసారథి చేత ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం వినాయక లడ్డూను వేలం వేయగా టిడిపి జిల్లా మహిళా అధ్యక్షు రాలు సుబ్బరత్నమ్మ రూ. 25వేలకు దక్కించుకొన్నారు. హారాన్ని రూ. 11వేలకు పెద్దకోడిపల్లి నరేష్ దక్కించుకొన్నారు. అనంతరం వినాయకుని విగ్రహాన్ని శోభాయాత్రగా తీసుకెళ్లి రొద్దం పెద్దచెరువులో నిమజ్జనం చేశారు. శోభాయాత్రలో వివిధ గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని వినాయకుడిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు నరసింహులు, సుబ్బరత్నమ్మ, నరహరి, టైలర్ ఆంజనేయులు, నరసింహులు, జివిపి.నాయుడు, రామకృష్ణ, మురళి, రొద్దకంపల్లి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మడకశిర రూరల్ : మండలంలోని నీలకంఠాపురం గ్రామంలో సోమవారం నాటితో వినాయక నవరాత్రులు ముగిశాయి. గణేశ్ నిమజ్జన వేడుకలో సిడబ్ల్యుసి సభ్యులు ఎన్. రఘువీరారెడ్డి పాల్గొన్నారు. స్వామివారిని గ్రామ వీధుల్లో ఊరేగించి అనంతరం నిమజ్జనం చేశారు.



విగ్రహ ఊరేగింపులో పాల్గొన్న రఘువీరా

ప్రజలకు అందని '108' సేవలు..!

ప్రజాశక్తి-గుడిబండ

మడకశిర నియోజకవర్గంలో 108 వాహనాలు మూలన పడడంతో ప్రజలకు వాటి సేవలు సక్రమంగా అందడం లేదు. అగళి, రొళ్ల, గుడిబండ, మడకశిర, అమరాపురం మండలాల పిహెచ్‌సిలకు ఒకటి చొప్పున 108 వాహనాలను కేటాయించారు. అవి మరమ్మతులకు గురికాగా ఎవరూ పట్టించు కోకపోవడంతో మూలనపడ్డాయి. దీంతో ఆపద సమయంలో 108 అందుబాటులో లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలోనే అమరాపురం పిహెచ్‌సికి కేటాయించిన 108 వాహనం మూలన పడి చాలా రోజులైనా పట్టించుకునే వారే కరువయ్యారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. 108 సేవలు అందుబాటులో లేకపోవడంతో రోగాల బారిన పడిన నిరుపేదలు ప్రయివేట్ ఆసుపత్రులకు వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 108 వాహనానికి మరమ్మతులు చేయించి మూడు నాలుగు రోజుల్లో నడుపుతామని చెబుతున్నా ఆచరణకు నోచుకోలేదు. అలాగే అమరాపురం, గుడిబండ మండలాల్లో ఉన్న 108 వాహనాలు పూర్తిగా మూలన పడటంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రొళ్ల మండలంలో ఉన్న 108 వాహనానికి సెల్ఫ్ లేకపోవడంతో ప్రజలు తోస్తేనే ముందుకుకదిలే పరిస్థితి ఉంది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి 108 వాహనాలకు మరమ్మతులు చేయించి రోగులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

108 సూపర్‌వైజర్ రవీంద్ర వివరణ

ఈ విషయమై 108 సూపర్‌వైజర్ రవీంద్రను వివరణ కోరగా మడకశిర నియోజకవర్గంలో అమరాపురం, గుడిబండలో 108 వాహనాలకు మరమ్మతులు చేయించి 3, 4 రోజుల్లోపు రోగులకు అందుబాటులో ఉంచుతామని వివరణ ఇచ్చారు.

మెడికల్ కళాశాలల్లో అడ్మిషన్లు నిర్వహించాలి

ప్రజాశక్తి-అనంతపురం

పులివెందుల, ఆదోని మెడికల్ కళాశాలల్లో అడ్మిషన్లు నిర్వాహించేందుకు చర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు వెన్నపూస రవీంద్రారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ పులివెందుల మెడికల్ కళాశాలను ఒక్కసారి కూడా పరిశీలించకపోవడం బాధాకరమన్నారు. స్వయానా ఎమెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి ఇంటికి సమీపంలోనే ఉన్నా ఒక్కసారి కూడా వెళ్లకపోవడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టబద్రుల ఓట్లతో గెలుపొందిన ఆయన వారిని పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్సీతోపాటు ప్రభుత్వం మెడికల్ కళాశాలపై దృష్టి సారించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



విలేకరులతో మాట్లాడుతున్న వెన్నపూస రవీంద్రారెడ్డి

'ఉపాధి' సామాజిక తనిఖీ ప్రజా వేదిక

బెలుగుప్ప : మండలవ్యాప్తంగా ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులపై ఎంపిపిపి పెద్దన్న అధ్యక్షతన సోమవారం ప్రజావేదిక కార్యక్రమం నిర్వ హించారు. ఇందులో భాగంగా గ్రామ పంచాయతీల రికార్డులను పరిశీలించారు. మండలంలోని 19 పంచాయతీల్లో ఉపాధి నిధులతో చేపట్టిన పనులను క్షేత్రస్థా యిలో తనిఖీ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయా పంచాయతీల్లో 1122 పనులకు రూ.7.38 కోట్ల ఖర్చు చేశారు. ఈ సందర్భంగా ఆయా పనులను చదివి వినిపించారు. ఇందులో మండల వ్యాప్తంగా రూ.17,33,358 రికవరీకి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డ్వామా ఎపిడి సుధాకర్‌రెడ్డి, ఎంపిడిఒ రామచంద్ర, ఎస్ఆర్‌పి లక్ష్మీనారాయణ, పిఆర్ ఎఇ సుధాకర్, హౌసింగ్ ఇఎ శివారెడ్డి, సర్పంచి సాలిబాయి, వైస్ ఎంపిపి పుష్పావతి, టిడిపి నాయకులు కన్వీనర్ ప్రసాద్, జిల్లా కార్యదర్శి మల్లికార్జున, ఉపాధ్యక్షులు పెద్ద తిప్పయ్య, ఈశ్వరప్ప, బిజెపి మండల కన్వీనర్ వన్నూరుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఈక్రాప్ బుకింగ్ చేయించుకోండి

గార్లదిన్నె : పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా ఈక్రాప్ బుకింగ్ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఇప్పటి వరకూ 7,384 రైతులు 28,000 ఎకరాలకు ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకున్నారన్నారు. మిగిలిన రైతులు కూడా చేయించుకోవాలన్నారు. లేనిపక్షంలో ప్రభుత్వం పథకాలకు అర్హులు కారన్నారు.

పాత్రికేయులు సమాజాభివృద్ధికి తోడ్పాటు అందించాలి

రాష్ట్ర మంత్రులు సత్యకుమార్, సవిత

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పాత్రికేయులు సమాజం అభివృద్ధి కోసం ప్రభుత్వాలకు తోడ్పాటు అందించాలని మంత్రులు సత్యకుమార్‌యాదవ్, సవిత సూచించారు. స్థానిక సాయి ఆరామంలో సోమవారం ఎపియుడబ్ల్యుజె జిల్లా అధ్యక్షుడు సి.పుల్లయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మంత్రి సవిత మాట్లాడుతూ గత ఐదేళ్ల రాక్షస పాలనలో అన్ని వర్గాల ప్రజలతో పాటు పాత్రికేయులు ఇబ్బందులు పడ్డామన్నారు. పుట్టపర్తిలో ప్రెస్‌క్లబ్ ఏర్పాటుకు తన వంతు సహకారం అందిస్తానన్నారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం పాత్రికేయులకు అక్రిడిటేషన్లు ఇవ్వడానికి కూడా ఇబ్బందులు పెట్టిందన్నారు. సమాజంలో పాత్రికేయులు ఫోర్త్ ఎస్టేట్ అని, వాస్తవాలు మాత్రమే సమాజానికి అందించాలన్నారు. ఎంపి బికె.పార్థసారథి మాట్లాడుతూ రైల్వే మంత్రితో మాట్లాడి రైల్వే పాసులను పునరుద్ధరిస్తామన్నారు. ప్రెస్ క్లబ్ నిర్మాణానికి తన వంతు సాయం చేస్తానని హామీ ఇచ్చారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ పాత్రికేయులకు తాను ఎప్పుడూ అండగా ఉంటానన్నారు. ఏటా హెల్త్ కార్డులకు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రీమియం చెల్లిస్తున్నానన్నారు. పాత్రికేయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం ద్వారా పరిష్కరించాలని ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్షుడు ఐవి సుబ్బారావు డిమాండ్ చేశారు. సభలోనే మంత్రులు సవిత, సత్యకుమార్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి పాత్రికేయుల సంక్షేమ నిధికి రూ. లక్ష చొప్పున విరాళం ప్రకటించారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రులు సవిత, సత్యకుమార్

కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, యూనియన్ నాయకులు నాగరాజు, ప్రభాకర్, ఈఎస్.రాజు, పయ్యావుల ప్రవీణ్, ఐజెయు సభ్యుడు శ్రీనివాసులు, బాబు, హరి, శివ, పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.

నెంబర్ ప్లేట్ లేని ట్రాక్టర్‌తో ఇసుక అక్రమ రవాణా

సోమందేపల్లి : అక్రమార్కులు నెంబర్ ప్లేట్ లేని ట్రాక్టర్లతో ఇసుక, ఎర్రమట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకంటు న్నారు. ప్రధానంగా ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు రోజుల్లో ఎలాంటి అనుమతులు లేకుండా సమీపంలోని చెరువు నుంచి ఇసుక, కొండల నుంచి ఎర్రమట్టిని ఇష్టారాజ్యంగా తవ్వి తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. సోమవారం ఓ ఇసుక ట్రాక్టర్ నెంబర్ ప్లేట్‌కు తెల్ల రంగు వేసి మరీ ఇసుక తరలిస్తుండగా స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో కెమెరాకు చిక్కింది. అధికారులు మామూళ్ల మత్తులో జోగుతుండడంతోనే ఇసుక, ఎర్రమట్టి మాఫియా చెలరేగిపోతుందని ప్రజలు పేర్కొంటున్నారు. ఇకనైనా ఉన్నతాకారులు స్పందించి ఇసుక, ఎర్రమట్టి మాఫియాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.



నెంబర్ ప్లేట్ లేని ట్రాక్టర్‌లోఇసుక రవాణా

నేటి నుంచి 'స్వచ్ఛత హి సేవ'

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

మున్సిపాలిటీ పరిధిలో ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకూ 'స్వచ్ఛత హి సేవ' కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ప్రహ్లాద సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు స్థానిక హనుమాన్ కూడలిలో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ తుంగ ఓబుళపతి ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు పాల్గొనాలని ఆయన సూచించారు. పరిసరాల పరిశుభ్రత వల్ల ఆరోగ్యంగా ఉంటామని ప్రభుత్వం ప్రత్యేకంగా ఈ కార్యక్రమం చేపట్టిందని ప్రజాప్రతినిధులతో పాటు అన్ని వర్గాల ప్రజలు సహకరించి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

కొత్తచెరువు : మండలంలో నేటి నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకూ స్వభావ్ స్వచ్ఛత-సంస్కార్ స్వచ్ఛత పేరుతో స్వచ్ఛత హి సేవ కార్యక్రమాలు నిర్వహిస్తామని ఎంపిడిఒ బరాన్‌సాహెబ్ తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, జిల్లా కలెక్టర్ టిఎస్.చేతన్ హాజరవుతారని తెలిపారు. అన్ని గ్రామ పంచాయతీల్లో ర్యాలీలు, మారథాన్‌రన్, వర్క్‌షాపులు, శ్రమదానాలు, తదితర కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సఫాయి కర్మచారులకు సేఫ్టీ పరికరాలు అందించాలన్నారు. పారిశుధ్యం నిర్వహణపై క్షేత్రస్థాయిలో ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబి వేడుకలు

ప్రజాశక్తి-హిందూపురం

ప్రవక్త సూచించిన అడుగు జాడల్లో నడిచి కులమతాలకు అతీతంగా అందరికీ సహాయ సహకారాలు అందించాలని మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, మౌలానాలు సూచించారు. మహమ్మద్ ప్రవక్త జన్మదినం పురస్కరించుకుని సోమవారం పట్టణంలో మిలాద్ ఉన్ నబి వేడుకలు ఘనంగా నిర్వహించా రు. ముందుగా మేళాపురం జామియా మసీదు, ముక్కడిపేట గౌసియా మసీదు, రహమత్‌పురం ఆహాలే సున్నతుల్ జమాత్ కమిటీల ఆధ్వర్యంలో మక్కా, మదీనా నమూనాలను పురవీధుల్లో ఊరేగించారు. మౌలానాలు షాహీద్‌రజా, అబ్దుల్‌రజాక్ సాహేబ్ మిలాద్ ఉన్ నబి ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం మౌలానాలు ప్రత్యేక ప్రార్థన గీతం ఆలపించి దువా చేశారు. ఆర్ఎంఎస్ షఫీవుల్లా ఆధ్వర్యంలో ఎన్టీఆర్ సర్కిల్‌లో మిఠాయిలు పంపిణీ చేశారు. ఆయా కమిటీల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సిఐ అబ్దుల్ కరీం ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పుస్తకం ఆవిష్కరించిన జడ్జి శ్రీధర్

ప్రజలను మంచి మార్గంలో నడవాలని శాంతి సందేశం ఇచ్చిన మహనీయులు మహమ్మద్ ప్రవక్త అని సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్ తెలిపారు. తెలుగులో అనువాదం చేసిన మహమ్మద్ ప్రవక్త వ్యవహార సరళి పుస్తకాన్ని మైనారిటీ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు ఉబేదుల్లాహుస్సేన్ అధ్యక్షతన జడ్జి నివాసంలో ఆవిష్కరించారు. అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షులు ఉమర్ ఫారూఖ్ ఖాన్ ఆధ్వర్యంలో పట్టణ, అప్‌గ్రేడ్ స్టేషన్, రూరల్ సిఐలు రాజగోపాల్‌నాయుడు, అబ్దుల్ కరీం, ఆంజనేయులు, జనార్దన్‌తో పాటు అధికారులు, ప్రముఖులకు పుస్తకంతో పాటు మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిప్పు సుల్తాన్ మానవతా రక్త దాన సంఘం అధ్యక్షుడు షేక్‌షబ్బీర్, బిలాల్, ఆమీన్, జామియా సభ్యులు సిరాజ్, ఫ్రూట్ రహ్మాన్, మాజీ కౌన్సిలర్ జహీర్, జుబేర్, జమీర్, ఫైరోజ్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.



కదిరిలో మిలాద్ ఉన్ నబి ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కందికుంట

పెనుకొండ టౌన్ : మహమ్మద్ ప్రవక్త జన్మదినం పురస్కరించుకొని సోమవారం పట్టణంలో మిలాద్ ఉన్ నబి వేడుకలను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. మసీదు నమూనాలు, చాదర్‌తో స్థానిక జామియా మసీదు నుంచి పట్టణ పురవీధుల్లో ర్యాలీగా బాబాయ్య స్వామి దర్గాకు వెళ్లారు. పెనుకొండ సిఐ రాఘవన్ ఆధ్వర్యంలో ఎస్ఐలు, పోలీసులు బందోబస్తు నిర్వహించారు. బాబా ఆటో యూనియన్ ఆధ్వర్యంలో డ్రైవర్లు, ప్రయాణికులు, మహిళలకు ఖర్జూరం, పాయసం, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. కుమ్మరదొడ్డిలో ఖాజా గరీబ్ నవాజ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 150 మంది పేదలకు ఆహారధాన్యాల కిట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా మంత్రి సవిత భర్త వెంకటేశ్వరరావు హాజరై సొసైటీ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సొసైటీ గౌరవాధ్యక్షులు జాబిలి చాంద్‌బాషా, పట్టణ టిడిపి కన్వీనర్ శ్రీరాములుయాదవ్, అధ్యక్షులు షఫీవుల్లా, నిస్సార్, సనావుల్లా, జహీరుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

శాంతి ర్యాలీలో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు

కదిరిటౌన్ : ముస్లింలు పట్టణంలో చేపట్టిన శాంతి ర్యాలీలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, మాజీ ఎమ్మెల్యేలు పార్థసారథి, అత్తార్ చాంద్‌బాషా పాల్గొన్నారు. ఎమ్మెల్యే ముస్లింలతో కలిసి నానా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రజలకు మిలాద్ ఉన్ నబి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతిఒక్కరూ ప్రవక్త సిద్ధాంతాలకు అనుగుణంగా ముందుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పివి.పవన్‌కుమార్‌రెడ్డి, వైసిపి నాయకులు మక్బూల్‌అహ్మద్, పూల శ్రీనివాసరెడ్డి, పాల్గొన్నారు. ఎపి మెప్మా



పురంలో మక్కా, మదీన నమూనాలను ఊరేగిస్తున్న ముస్లింలు

ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రిలో బాలింతలకు దుస్తులు, బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎపి మెప్మా అధ్యక్షులు హాజీ ఖాదర్‌బాషా, ఆసుపత్రి సూపరింటెండెంట్ హుస్సేన్, కమిటీ సభ్యులు చాంద్‌బాషా, సాధిక్, ఇర్ఫాన్, ఇమ్రాన్, సోహైల్, షేక్ ఇర్ఫాన్, మహమ్మద్, అజీజ్, అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ : స్థానిక మసీదులో ముస్లింలు మిలాద్ ఉన్ నబి వేడుకలను ఘనంగా నిర్వహించారు. యువకులు పురవీధుల గుండా బైక్ ర్యాలీ నిర్వహించారు. మసీదులో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మతపెద్దలు రజాక్‌సాబ్, నసురుద్దీన్, వలిసాబ్, ఖాదర్, మహబూబ్‌బాషా, నియాజ్, షబ్బీర్, మహపీర్‌బాషా, ఇద్రిష్, గౌస్,షౌకత్ అలీ, నయాజ్, 104 షబ్బీర్, బుడేన్, తదితరులు పాల్గొన్నారు.



పెనుకొండలో మిలాద్ ఉన్ నబి ర్యాలీ చేపట్టిన ముస్లింలు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



వాహనంలోనే మృతి చెందిన డ్రైవర్

పుట్టపర్తి క్రైమ్ : మండలంలోని వీరజిన్నయ్యపల్లి సమీపంలో సోమవారం బొలెరో వాహనం అదుపుతప్పి చెట్టుకు ఢీ కొనడంతో డ్రైవర్ మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. సాయంత్రం 4 గంటల సమయంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను పుట్టపర్తి నుంచి బొలెరో వాహనంలో ఒడిసి మండలానికి తరలిస్తుండగా మార్గమధ్యలో వీరజిన్నయ్యపల్లి సమీపంలో బొలెరో వాహనం అదుపుతప్పి ఓ చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో డ్రైవర్ అశోక్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందగా మరొకరు తీవ్రంగా గాయపడగా మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ కృష్ణమూర్తి పోలీసులతో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. గాయపడిన వ్యక్తులను హుటాహుటిన కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

విద్యుత్ వైరు తెగిపడి గొర్రెలు మృతి

రూ. 1.50 లక్షల నష్టం

గుడిబండ : విద్యుత్ వైరు తెగి మీద పడడంతో మండలంలోని ఎంఎస్ తండా గ్రామానికి చెందిన మహిళా పాడి రైతు దైవలిబాయికి చెందిన దిన 8 గొర్రెలు, ఒక మేక మృత్యువాత పడ్డాయి. బాధితురాలు తెలిపిన వివరాలు.. దైవలిబాయి భర్త కొన్నేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఆమె ప్రయివేట్ వ్యక్తుల వద్ద అప్పు చేసి గొర్రెలు, మేక కొనుగోలు చేసి వాటి ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటోంది. మూగజీవాలను గ్రామం పక్కనే ఓ రేకుల షెడ్డు ఏర్పాటు చేసి అందులో ఉంచేది. ఆదివారం రాత్రి ఉన్న ఫలంగా విద్యుత్ వైరు తెగి గొర్రెల మీద పడడంతో 8 గొర్రెలు, ఒక మేక మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటనతో రూ. 1.5 లక్షల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం, అధికారులు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని ఆమె కోరారు.



విద్యుత్ వైరు తెగి పడి మృతిచెందిన గొర్రెలు, మేక

వంకలో పడి వ్యక్తి మృతి

పామిడి : మద్యం మత్తులో బ్రిడ్జిపై నుంచి వంకలో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం పట్టణ పరిధిలో వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే... మూడు రోజుల క్రితం ఎద్దులపల్లికి చెందిన రామదాసు (60) మద్యం మత్తులో సమీపంలోని బ్రిడ్జి పై నుంచి వంకలో పడిపోయాడు. వంకలో ఎక్కువ లోతు ఉండటంతో ఎంత వెతికినా కనిపించలేదు. మూడు రోజుల క్రితం వెళ్లిన రామదాసు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకడం ప్రారంభించారు. ఈనేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం నీటి గుంతలో నుండి శవమై కనిపించాడు. ఈ మేరకు కు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.